క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో నలుగురికి గాయాలు



గాయపడిన వ్యక్తితో మాట్లాడుతున్న ఎస్ఐ

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడులో ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌తో నలుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గ్రా మదేవత శ్రీముంగమూరి పరమేశ్వరి దేవి గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని ట్రాక్టర్‌లో కొలువుదీర్చారు. పండితులు ఇత్తడి పళ్లెంలో హారతి ఇస్తుండగా వాహనానికి విద్యుత్ షాక్ తగిలింది. దీంతో పనబాక గౌరీ, ఆమె భర్త నాగూర్, కుమారుడు బోసు, సమీప బంధువు రఘుపతి గాయపడ్డారు. వారిని స్థానికులు నెల్లూరులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. గౌరీ పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన ముగ్గురికి ప్రాణాపాయం లేదని బంధువులు తెలిపారు. నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎస్ఐ స్వప్న అక్కడికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన కాలనీలో తాగునీటి సమస్య

కోట: మండల కేంద్రమైన కోట పంచాయతీ శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. మంచినీటి పథకానికి సంబంధించిన మోటార్లు పనిచేయక పోవడంతో రెండు రోజులుగా నీరు రావడం లేదని పేర్కొంటున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

భూ సమస్యలపై వినతులు

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపైనే ఎక్కువ వినతులు అందినట్టు తహసీల్దార్ శైల కుమారి తెలిపారు. పూలతోట గ్రామం పరిధిలోని భూ ఆక్రమణపై బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. అంతేకాకుండా అడంగళ్ల, 1బీలో చేర్పులు, మార్పుల కోసం రైతులు అర్జీలు ఇచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, అధికారులు ఉమామహేశ్వరి, హేమలత, హరికృష్ణ, మోహన్‌రావు, జ్యోతిర్మయి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జేఈఈలో చిట్టమూరు విద్యార్థిని ప్రతిభ



స్మాటీ విజ్ఞాపిక

చిట్టమూరు : జాతీయ స్థాయిలో జరిగిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో చిట్టమూరు మండలం దరఖాస్తు గ్రామానికి చెందిన అద్దూరు నాగరాజు, సునంద దంపతుల కుమార్తె స్మాటీ విజ్ఞాపిక 3,165 ర్యాంకు సాధించింది. ఆమెను తల్లిదండ్రులతో పాటు మండల ప్రజలు అభినందించారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



బాలాయపల్లి (సైదాపురం) : ఆపరేషన్ సింధూర్‌లో అశువులు బాసిన వీర జవాన్లకు సోమవారం బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు కొండూరు వెంకట సుధాకర్‌రాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బాలాయపల్లి మండలంలోని నిండలి గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాశ్మీర్‌లో అమాయకులపై దాడి చేసి హత్య చేసిన ఉగ్రవాద స్థావరాలను మన సైన్యం నాశనం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండూరు నరసింహ రాజు, కొండూరు మధురాజు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు బియ్యం సరఫరా

చిట్టమూరు : మండలంలోని రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసినట్లు తహసీల్దార్ కాయల సతీష్ కుమార్ సోమవారం తెలిపారు. మండలంలో 33 షాపులు ఉండగా జూన్ 1వ తేదీన కొన్నింటికి సరఫరా కాలేదన్నారు. మంగళవారం నుంచి అన్ని షాపుల్లోనూ తెల్లరేషన్ కార్డు దారులు సరుకులు తీసుకోవచ్చని పేర్కొన్నారు. డీలర్లు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు ఇస్తారని తెలిపారు. 15వ తేదీ వరకు షాపులు తెరిచి ఉంచాలని ఆదేశించారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

దక్కిలి : ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఆయన సోమవారం వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. యూనిఫాం ధరించాలని, వాహనం రికార్డులు ఉండాలన్నారు.

మాయమైన ఆడబిడ్డ నిధి

'కుటుంబంలో మహిళలే మహరాణులు. మహిళ ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం బాగుంటుంది. మేము అధికారంలోకి వస్తే మహిళలను మహరాణులను చేస్తాం. ఇందుకోసం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలుచేసి ఇంటిలో ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1500ల చొప్పున అందజేస్తాం' అని చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పథకం గురించిన ఊసే ఎత్తలేదు. మహిళలు పథకం కోసం ఎదురుచూస్తున్నారు.

- 12 నెలలైనా అమలుకాని థకం
- కూటమి నేతల హామీలకు మోసపోయిన మహిళలు
- సాయం కోసం ఎదురు చూపు



చంద్రబాబు ఎన్నికల్లో ప్రకటించిన పథకం పోస్టర్

నియోజకవర్గం	మహిళలు	పొందాల్సిన లబ్ధి
గూడూరు	71 వేలు	10.65 కోట్లు
సూళ్లూరుపేట	72 వేలు	10.80 కోట్లు
వెంకటగిరి	73 వేలు	10.95 కోట్లు



పొదుపు మహిళలు

సైదాపురం : ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో టీడీపీ ఇచ్చిన హామీలను మడత పెట్టింది. సూపర్‌సిక్స్, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం ఇలా ప్రతి వర్గానికీ హామీలిచ్చిన చంద్రబాబు గద్దె నెక్కాక తుంగలో తొక్కారు. హామీల అమలును విస్మరించారు. ఇందులో ఉన్నదే ఆడబిడ్డ నిధి. ఈ పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క మహిళకూ నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందజేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. దీనికి ఎంతో ప్రచారం కల్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక మహిళల సంక్షేమాన్ని విస్మరించడమేకాక ఈ ఆడబిడ నిధి పథకాన్ని అమలు చేయడం మరిచిపోయారు.

రూ.388 కోట్ల మోసం

మూడు నియోజకవర్గాల్లోని మహిళలకు కూటమి ప్రభుత్వం ఏడాదికి గాను రూ.388 కోట్లు చెల్లించాల్సి ఉండగా మోసం చేసింది. 2024 జూన్ నాటి లెక్కల ప్రకారం వెంకటగిరి నియోజకవర్గంలో 18 ఏళ్లు, ఆపై వయసు కలిగిన మహిళలు సుమారు 73 వేల మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1,500 చొప్పున రూ.10.95 కోట్లు, గూడూరు నియోజకవర్గంలో 71 వేల మందికి నెలకు రూ.10.65 కోట్లు, సూళ్లూరుపేటలో 72 వేల మందికి 10.80 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ పథకం గురించి ఊసేలేదు.

వెంటనే ఇవ్వాలి



అధికారంలోకి రాగానే ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఆర్థిక సాయం అందజేస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల్లో చెప్పారు. మాకు కొంత ఆసరాగా ఉంటుందని భావించి ఓట్లు వేశాం. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పథకం అమలు గురించి పట్టించుకోలేదు. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నాం.

– నారిపోక అంకమ్మ, సైదాపురం మండలం

ఎప్పుడిస్తారో చెప్పాలి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందోనని ఎదురుచూస్తున్నాం. ఆడబిడ్డ నిధి పథకాన్ని ఏడాదిగా అమలు చేయడం లేదు. ఇదేకాక మిగిలిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో ఆర్థిక సాయం పొందలేకపోతున్నాయి. ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలుచేసి ఆర్థిక అందజేయాలి.

– పసల మంజుల, సైదాపురం మండలం

పవన్‌కళ్యాణ్ స్పందించాలి



సూపర్ సిక్స్ పథకాల అమలు బాధ్యతను నేను తీసుకుంటాను అని ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఏడాది అవుతున్నా ఆడబిడ్డ నిధి పథకం గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు ప్రకటించినా ఫలితం లేదు. దీని గురించి పవన్‌కళ్యాణ్ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణం. దీనిపై ఆయన స్పందించాలి.

– వెన్నెల, వెంకటగిరి

పథకాలకు బాబు వెన్నుపోటు



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాపూరు: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పాపకన్ను మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం నాయకులతో కలిసి రాపూరులోని బాలాజీ కల్యాణ మండపంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని హామీలను అమలుచేశారని గుర్తుచేశారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాన్ని వివరిస్తూ బుధవారం రాపూరులో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, కలువాయి, రాపూరు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ జెట్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొద్దు మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, మైనారిటీ సెల్ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, ఎపిచ్చిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రమణయ్య, గణేష్‌రెడ్డి, సంజీవరెడ్డి, గౌస్‌పీర్, సలాం, వరబాబు, నారాయణరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలపై కూటమి ప్రభుత్వం కక్షకట్టింది



పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి

కోట: కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష కట్టిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం కోటలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం పేదలకు ఇంటి వద్దే రేషన్ పంపిణీని చేపట్టిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పేదలపై కక్ష పెంచుకుని ఆ పథకాన్ని రద్దు చేసిందని దుయ్యబట్టారు. ప్రజలు ఎండలో రేషన్ షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. పనులు మానుకుని సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. రేషన్ దుకాణాల వద్ద ప్రజలు అవస్థలు పడుతుంటే టీడీపీ నాయకులు ప్రారంభాల పేరుతో హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలంతా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇంటికే రేషన్ సేవలను కొనియాడుతున్నారని పేర్కొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి



పాదర్తి హరనాథ్‌రెడ్డి

ఓజిలి: నాయుడుపేట పట్టణంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

హామీల అమలు ఎక్కడ బాబు?



మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు : సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు ఎక్కడ బాబు అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ ప్రశ్నించారు. ఆయన సోమవారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో గూడూరు పట్టణ, రూరల్, చిల్లకూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. రైతులకు పెట్టుబడి సాయం అందించకపోగా పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేదన్నారు. ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు తల్లికి వందనం ఇవ్వలేదని విమర్శించారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఊసే లేదని దుయ్యబట్టారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా గూడూరు టవర్ క్లాక్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి నిరసన తెలుపుతామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ, చిల్లకూరు మండలాల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, యద్దల మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాక్రిష్టారెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య, కొండూరు సునీల్‌రెడ్డి, యల్లా శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, నందవరం సుబ్బారావు, నాగిశెట్టి శారదమ్మ, దీప్తి, సుజనారెడ్డి, సనత్ కుమార్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రవీంద్రరెడ్డి, జమ్మళవాసు, వినోద్, పూర్ణచంద్ర, గోపీయాదవ్, సుభాన్, బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం వెంకటగిరికి వస్తున్నట్టు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 4వ తేదీన రాపూరులో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం చేయడంపై కార్యకర్తలు, నాయకులతో సమీక్షించనున్నట్లు తెలిపారు.

పొగాకు వినియోగంతోనే క్యాన్సర్



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

బాలాయపల్లి(సైదాపురం): పొగాకు వినియోగంతోనే ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నట్టు బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి లియోనా తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం పెరిమిడి, జయంపు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్యభాను, సర్పంచులు కృష్ణయ్య, సుప్రజ పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

కోట : పాముకాటుతో కొత్తపట్నంకు చెందిన తిరుమూరు వెంకటేశ్వర్లు అస్వస్థతకు గురయ్యాడు. అతను సోమవారం ఉదయం తన పొలంలో పనిచేస్తుండగా పాముకాటు వేసింది. అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో గూడూరుకు తీసుకెళ్లారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

సైదాపురం:అనుమతి లేకుండా క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన సోమ వారం విలేకరులతో మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు సైదాపురం సమీపంలోని లింగసముద్రానికి వెళ్లే రోడ్డులో తనిఖీ చేసినట్టు తెలిపారు. అనుమతి లేకుండా తెల్లరాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

దాడి ఘటనపై విచారణ

కోట : కొందరు వ్యక్తులు తనను హత్య చేసేందుకు యత్నించారని కోటకు చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ రమణ సోమవారం ఎస్ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాత్రి బైక్‌లో ఇంటికి వెళుతుండగా కొందరు అడ్డగించి కళ్లలో కారం చల్లి దాడి చేసినట్టు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండో విడత భూ సేకరణపై కేంద్ర కమిటీ ఆరా



డ్రోన్‌తో భూముల సర్వేను పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు, తహసీల్దార్

చిల్లకూరు : తీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న క్రిస్ సిటీ కోసం రెండో విడత భూ సేకరణపై కేంద్ర కమిటీ బృందం సోమవారం ఆరా తీసింది. చిల్లకూరు, కోట మండలాల్లోని తమ్మినపట్నం, సిద్ధవరం రెవెన్యూ పరిధిలో క్రిస్ సిటీని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మొదటి విడతగా 950 ఎకరాల భూమిని సేకరించారు. కొంతమంది రైతులకు పరిహారం కూడా అందజేశారు. మిగిలిన వారికి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రెండో విడతలో ఎంత భూమిని సేకరించవచ్చు అనే విషయంపై కేంద్ర కమిటీ బృందం సోమవారం చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ మల్లికార్జున్‌తో కలిసి పర్యటించింది. ఏపీఐఐసీకి అప్పగించిన భూములపై డ్రోన్ సర్వే నిర్వహించారు. త్వరలో క్రిస్ సిటీకి రెండో విడత ఎంత భూమి అప్పగించాలనే విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి హద్దులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా సాగు లాభదాయకం



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు పంటలు సాగుచేసుకుంటే లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాసులురెడ్డి, రాజీవన తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాపమాంబపురం, అమ్మపాళెం, పారవోలు, గొల్లగుంట గ్రామాల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు నాగార్జున రెడ్డి, తిరుపాల్‌తో కలిసి రైతులతో ముఖాముఖి చర్చా కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నూతన వంగడాలు దాన్–60, 66, 75, స్ఫూర్తి రకాలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు. ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త అనంత, రైతులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో గోపి

చిల్లకూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన మండలంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో గోపి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోడ్డు పక్కన మొక్కలు నాటడంతోపాటు అవెన్యూ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్, పారంపాండ్ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు యువకులు, మహిళలు ముందుకురావాలన్నారు. ఉపాధి ఏపీవో గిరిబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి



పాతకోట పీహెచ్‌సీలో మందుల వివరాలను తెలుసుకుంటున్న ఆరిశంకరయ్య

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి పట్టణంలో వున్న అర్బన్ పీహెచ్‌సీలో అందజేస్తున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని 14వ వార్డు కౌన్సిలర్, ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరి శంకరయ్య సూచించారు. ఆయన సోమవారం చెవిరెడ్డిపల్లి, పాతకోట, వెంకటగిరి సీహెచ్‌సీని పరిశీలించారు. అంతకుముందు 14వ వార్డు సుదర్శన్‌నగర్‌లోని సచివాలయంలో పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు

చిల్లకూరు : పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ తెలిపారు. వారు సోమవారం పేదలతో కలిసి గూడూరులోని సీపీఐ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో పేదలకు ఇళ్ల స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీలను అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఆర్‌కుమార్, నారాయణ, రాజా, కరీముల్లా, నరసింహులు, అబ్దుల్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో చైన్ స్నాచింగ్

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలోని బాలాజీ గ్రీన్ సిటీ సమీపంలో చంద్రమ్మ అనే మహిళ మెడలో ఉన్న బంగారు సరుడును సోమవారం రాత్రి దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసుల కథనం మేరకు.. బీడీ కాలనీకి చెందిన చంద్రమ్మ సోమవారం రాత్రి ఇంటికి వెళ్లేందుకు బాలాజీ గ్రీన్ సిటీ సమీపంలో నడిచి వెళుతోంది. బైక్‌లో వేగంగా వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు సరుడును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

బెల్టు దెబ్బకి మద్యం దుకాణం మూత



పూలతోట గ్రామంలో మూతపడిన మద్యం షాపు

దొరవారిసత్రం : మండలంలో కూటమి నేతలు బెల్టు షాపులను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. దీంతో రూ.లక్షలు చెల్లించి టెండర్ దక్కించుకుని ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలు మూత పడుతున్నాయి. డీవీ సత్రం మండలానికి కూటమి ప్రభుత్వం మూడు మద్యం షాపులు(కల్లు గీత కార్మికుల షాపుతో కలిపి) మంజూరు చేసింది. టెండర్లలో షాపులు దక్కించుకున్న వారు డీవీ సత్రం, పూలతోట, తొగరాముడి గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటు చేశారు. కల్లుగీత కార్మికుల మద్యం షాపు గూడూరు ప్రాంతం వారికి దక్కింది. దాన్ని నియోజకవర్గ స్థాయిలో పలుకుబడి కలిగిన కూటమి నేత నిర్వహిస్తున్నాడు. వారు ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం సరఫరా చేస్తున్నారు. పూలతోటలో ఏర్పాటుచేసిన బెల్టు షాపునకు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పూలతోటలో ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటైన మద్యం షాపు నిర్వాహకులు చేసేదేమీ లేక పది రోజుల క్రితం మూత వేశారు. గ్రామాల్లో బెల్టు షాపులను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిరసన

వెంకటగిరి రూరల్ : పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, రూరల్ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. ఇళ్ల నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణ, స్ట్రీట్ వెండర్స్ నాయకులు టౌన్ అధ్యక్షుడు నరసింహులు, సెక్రటరీ మునీంద్ర, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు వద్ద సోమవారం రాత్రి కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఏటిగట్టు కాలనీ వద్ద ఉంటున్న వెంకటేశ్వర్లు ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి శ్రీకాళహస్తి బైపాసు వద్ద రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మీ అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును బూదనం టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. కారు డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కులం సర్టిఫికెట్ మంజూరులో వివాదం

కలువాయి(సైదాపురం) : కులం సర్టిఫికెట్ మంజూరులో రాజకీయ జోక్యం చేసుకుని జాప్యం చేస్తున్నారని కలువాయి నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన ఓ వర్గం వారు సోమవారం నెల్లూరు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌కు ఫిర్యాదుచేశారు. కలువాయి నాయీబ్రాహ్మణ కాలనీలో ఇటీవల రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక వర్గం వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై ఫిర్యాదు చేసిన వ్యక్తికి కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో మంజూరు చేసిన కులం సర్టిఫికెట్లను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో కలెక్టరేట్ అధికారులు తహసీల్దార్ శ్యామ్ సుందర్, వీఆర్వో రవిని నెల్లూరుకు పిలిపించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మాంబట్టు రోడ్డులో ఆగిపోయిన బస్సు

తడ: మాంబట్టు సెజ్ పరిధిలోని ప్రైవేటు పరిశ్రమకు కార్మికులను తీసుకువెళుతున్న ప్రైవేటు బస్సు డీజిల్ ట్యాంక్ నుంచి డీజిల్ లీక్ కావడంతోపాటు కింద పడిపోయింది. బస్సు ఆగిపోవడంతో కార్మికులకు పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన సోమవారం తడ సమీపంలో చోటు చేసుకుంది. బస్సులో సుమారు 50 మంది కార్మికులు ఉన్నారు. సెజ్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటుకావడంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో బస్సులకు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా కాంట్రాక్టర్లు మూలనపడిన బస్సులను కంపెనీలకు లీజుకు పెడుతున్నారు. రవాణాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సుల కండీషన్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.